# అగ్నిపథం

'హారిస్'



గడియారం రెండుగంటలు కొట్టింది అనూరాధ బాధగా సోఫాలో కదిలింది విస్రాంతితో ఆమె శరీరం తూలిపోతున్నది అంతకుమించిన వేదనతో మనసు తూట్లుపడుతున్నది

కిటికీలోంచి చల్లనిగాలి తెరలు తెరలుగా లోపలకు వస్తున్నది వెన్నెల వూచలసందుల్లోంచి చారలుచారలుగా నేలమీద– తివాచీమీద పడుతున్నది ఆ గది కాస్త పెద్దదే మంచంమీద నుదుట ఉడుకులాం గుడ్డ వేసుకుని వున్నాడు ఉపేంద్ర గొంతుదాకా ఊలు రగ్గు కప్పుకున్నాడు అతడివంక చూడంగానే అప్రయత్నంగా నిట్టూర్చింది అనూరాధ

ఈ రాత్రిగడిచి తెల్లవారితే? ఏంచెయ్యాలి తాను? ఈ యింటిని, దీనిపై పెంచుకున్న మమకారాల్ని తెంచుకుని వెళ్లిపోగలదా? అతడు తనకు అఖర్లేదని శఠించిపోతే ఏంజరుగుతుంది?

అసలు తాము ఆరోజు పిక్నిక్‌కి పోకపోయినా బాగుండేది ...

చాలా పెద్ద ఇల్లు అది అయినా అనూరాధ తన నేస్తురాలితో ఆయింట అడుగుపెట్టిన మొదటిరోజు 'శిథిలాలయంలా యిలావుందేం?' అనుకున్నది ఆవరణఅంతా పిచ్చిమొక్కలతో భీభత్సంగా వుంది అప్పుడు గోడలు బెత్తికలు వూడి సున్నానికి మొహం వాచివున్నాయి కాంపౌండు గేటు కిర్రుమని తెరచుకొంటే 'దెయ్యాల కొంప లోకి పోవడంలేదుకదా?' అనుకున్నది

ఉపేంద్రకూడా అందుకు తగ్గట్టుగానే కనబడ్డాడు మాసిపోయిన గడ్డం, లోతుకుపోయిన కళ్లు—అతడిని చూడంగానే 'వైణిక సార్వభౌమ' బిరుదాంచిత డితడేనా అనుకున్నది తాను? అతను కూర్చుని వున్నగదిలో వీణ కనబడకపోయినా, అతడి వేళ్లలో వీణ పలుకుతూండకపోయినా నేస్తురాలు సువర్చలకి మతిభ్రమ ఒచ్చి మరెక్కడికో తీసుకొచ్చింది అనుకునేదే!

"నువ్వా సువర్చలా? కూచో!" అన్నాడతను తనను చూడంగానే

సువర్చల తనను పరిచయంచేసి వచ్చిన కారణం చెప్పింది

అతను ఒక్కక్షణం మాట్లాడలేదు ఆతరువాత 'నేను చెప్పలేను' అన్నాడు గద్గదికతను జయించటానికి యత్నిస్తూ

సువర్చల ఒక్కక్షణం ఆగి "అలాకాదు మాష్టారు! మీరుతప్ప మరెవరూ వీణ నేర్ప లేరంటున్నది అనూరాధ. కొండంత ఆశతో వచ్చాం" అన్నది

"ఎలా?"

"మీ యిష్టం! మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తుంది మీరు ఏం నేర్పితే అదే నేర్చుకుంటుంది"

ఉపేంద్ర జవాబుచెప్పలేదు గుమ్మంలో నిల్చునివున్న నౌకరు నరసయ్య "ఒప్పుకో బాబూ' అన్నాడు

ఆ రోజున ఏ సంగతీ చెప్పలేదు అతను మర వాడు నరసయ్య, వంటచేసే ఆవిడా సూరిపియ్యగా



రోజూ అరగంట పాఠం చెప్పడానికి అంగీకరించాడు అనూరాధ పొంగిపోయింది ఉపేంద్ర వెంటవెళ్లి యోగ్యమయిన వీణకొని తెచ్చుకున్నది

కొన్ని రోజులు గడిచాయి ఒకరోజున మామూలు ప్రకారం అనూరాధ పాఠానికి వొచ్చినవేళ గుమ్మంలోనే ఎదురయిన నరసయ్య ఆమెను పలుకరించాడు ఏదో పిచ్చాపాటి మాట్లాడాక "ఈఆవరణంతా, యిలా దిక్కుమాలి పడివుండాల్సిందేనా నరసయ్యా?" అనడిగిందామె

నరసయ్య తల ఎగురవేసి "అయ్యగారి నడగండమ్మా ఆసంగతి" అన్నాడు

ఆ రోజున అనూరాధ మర్చిపోకుండా అడిగింది ఉపేంద్ర తికమకపడి "ఎందుకులెండి" అన్నాడు పిరికిగా "బాగు చేయిస్తే నష్టమా?" అన్నది అనూరాధ

"లేదనుకోండి"

"కూలివాళ్లకు కబురు చెయ్యండి"

పాఠం అయిపోయి తిరిగి వస్తున్నప్పుడు అనిపించింది ఎప్పుడూ వూహాలోకాల్లో విహరిస్తూ వుండే అతడు కూలివాళ్ల సంగతి ఆలోచిస్తాడాఅని తానేపూనుకొని ఆవరణఅంతా పరిశుభ్రం చేయించి క్రోటన్సు, మొక్కలు నాటింపించింది

చాలా" శ్రద్ధ తీసుకుంటున్నావు" అన్నది సువర్చల ఆరోజున

అనూరాధకు ఆమాటతో ఉపేంద్రమీద కలుగుతోన్న జాలి పెంపొందింది

నిజం అంతేమరి! అనూరాధకు అతడి పరిచయం అయిన కొద్దిరోజుల్లోనే ఆమె అతడిసంగతి పూర్తిగా గ్రహించింది ఉపేంద్ర చాలా అమాయకుడు అంతేకాదు వ్యధాభరితుడు కూడాను కాని ఆ స్థితిలో కూడా అతని హస్తాల్లో వీణ నినదించే దివ్యసంగీతం అతడిలోని దైవత్వాన్ని ప్రపంచిస్తున్నప్పుడు లనిపించేది అనూరాధకు అతడు భాగ్యనగర ఆకాశవాణి కేంద్రంనుంచి ప్రసారంచేసిన కచేరీలు అనూరాధ మరిచిపోలేదు యవ్వన ఉత్తరార్థంలోవున్న అతడి జీవితం ఎండిపోయి శోషణం కావటం కళకు శాపం అనిపించింది అనూరాధకు. అతడు కోలుకోవాలి అందుకు తాను కారణమవడం కన్నా ఆనందంలేదు

ఒక రోజున పాఠం కోసం వెళ్లిన అనూరాధ ఉపేంద్ర వదనంలో వెలుగుతున్న ఉత్సాహాన్ని చూసి కించిత్ విస్మయపడింది ఆమెను చూడంగానే "రా అనూరాధా" అన్నాడతను ఆదేమొదటిసారి ఉపేంద్ర ఆమెను ఏకవచనంలో పిలవడం

"ఇవాళ చాలా హుషారుగా వున్నారే?" అన్నది అనూరాధ కూచుంటూ

"అవును నువ్వొచ్చేముందుదాకా మొక్కలమధ్య పిచ్చిగా తిరిగేసాను ఎంత బావుందని?"

అనూరాధ నయనాలను అతడు చూడకుండా చెంగుతో అద్దుకుంది

"ఇవాళ నీకు పాఠం చెప్పను నావీణ విను"

"అలాగే" అన్నది అనూరాధ

ఉపేంద్ర అవతలగా బల్లమీద పెట్టివున్న

54-వ పేజీ చూడండి







వుడ్‌వార్డ్స
'గ్రైప్ వాటర్'
తెలివైన తల్లులు
50 ఏళ్లనుంచి వాడుచున్నారు

అధికారయుత ఏజెంట్లు ; కోమల్ మేన్యుఫేక్చరింగ్ కెమిస్ట్స్ లిమిటెడ్ బొంబాయి; ఫిమ్ జి సహాని అండ్ కొ., (కలకత్తా) ప్రైవేట్ లిమిటెడ్ కలకత్తా; టి టి. క్రిష్ణమాచారి అండ్ కొ., మద్రాస్; ఎమ్. జి. సహాని అండ్ కొ; (ఢిల్లీ) ప్రైవేట్ లిమిటెడ్, ఢిల్లీ.

Aiyars OP. 148 TEL


# భగ్నవీణ

9 వ పేజీ తరువాయి

వీణ తెచ్చుకున్నాడు. అనూరాధ ఆయింటికి మొదటిసారి వొచ్చినప్పటినుంచి చూస్తున్నది. చాలా అందంగా ముద్దుగా వున్నదది. ఈనాడది పలుకుతుంది.

ఉపేంద్ర వీణ శృతి చేశాడు. ఆతరువాత కొంతసేపు సర్వచైతన్యమూ స్తంభించిపోయి నాదాకృతి దాల్చినట్లయింది అక్కడ. ప్రకృతి సర్వమూ సంగీత ప్రపూంతమై శోభించింది. అనూరాధ పరవశురాలై పోయింది.

ఆ నాదం ఆగేసరికి ఉపేంద్ర జాబ్బాతడిసి పోయింది—కన్నీటితో. అనూరాధ కొన్నిక్షణాలకు తెప్పరిల్లి "ధన్యురాలిని" అన్నది.

"ఈ వీణ మాగురువుగారిచ్చిన బహుమతి" అన్నాడతను కళ్ళు తుడుచు కుంటూ నవ్వుతూ.

"అదృష్టవంతులు."

"ఈ వీణకూ మామూలు వీణకూ తేడా కనబడ లేదూ?"

అనూరాధ 'నిజమే' ననుకుని "అవును. కాని అర్థంకాలేదు" అన్నది.

"ఇది శంఖవీణ. పైకి మామూలుగానే వున్నా నాదోత్పాదన కలిగించే యీ బుర్రతో శంఖపు వరలవంటి వరలున్నాయి. అందువలాన మామూలు వీణల్లో మీటుకు మీటుకు మధ్యవుండే ఖాళీ పోయి చిత్రమయిన నాదం నిండుతుంది యిందులో."

అనూరాధ ఒక్కక్షణం తటపటాయించి "మరొక్కసారి వాయించరూ" అన్నది.

ఉపేంద్ర నవ్వి "చదువుకునే పిల్లలు అలా అడక్కూడదు" అన్నాడు.

"మాష్టర్ను పాశాలెగ్గొట్ట వచ్చునా?"

ఇద్దరూనవ్వుకున్నారు.

ఆరాత్రి అనూరాధ ఆనందంతో నిద్రపోలేక పోయింది.

మరునటి రోజు శుక్రవారం. తలంటిపోసుకుని తనకి యిష్టమయిన చీరే, రైకా ధరించి ఉపేంద్ర యింటికి ఒచ్చింది అనూరాధ. ఆవరణలో ఏపుగా పెరుగుతున్న పచ్చటి మొక్కలూ వాటిమధ్యవున్న పచ్చికమీద సున్నితంగా పడుతోన్న ఉదయకిరణాలూ ఆమెకు ఎంతో ఉల్లాసాన్ని కలుగజేసాయి. ప్రేమగా క్రోటన్లను తడుముతూ ముందుకు వచ్చిన అనూరాధకు వరండాలో నరసయ్య చిరునవ్వు ముఖంతో ఎదురై "ఇయాల పొద్దుటే వచ్చారే అమ్మగారూ" అన్నాడు.

"ఊఁ!....అయ్యగారు మేడమీద వున్నారా?"

"ఉహుఁ! బైటికి వెళ్ళారు"

కొద్దిగా ఆశ్చర్య పడింది అనూరాధ "ఎవ్?" అన్నది కళ్ళు పెద్దవిచేసి.

"రైలుటేషన్ కెళ్ళారు. ఇయా లసిన బాబుగారొత్తుండారుగా?"

"చినబాబుగారా?" అన్నది అనూరాధ అర్థంగాక.

"అయ్యగారి అబ్బాయిగారూ, అమ్మగారూ!

ఆరి మామయ్యగారు ఆరూ వత్తుండారు"

అనూరాధకు కథ కొంతవరకూ అర్థమైనట్లని పించింది. మిగతాది నరసయ్యను అడిగి తెలుసుకున్నది. ఉపేంద్రకి రెండుసంవత్సరాల క్రితం భార్యావియోగం కలిగింది. ఆతరువాత అతడు భాగ్య నగర ఆకాశవాణిలో ఉద్యోగమూ వగైరా త్యజించి, తమ స్వంత మేడవున్న ఈఊరు వచ్చేశాడు. ఆరేళ్లకొడుకు రాంబాబు మేనమామదగ్గర ఉంటున్నాడు. ఆరు నెలలనుంచీ, నాన్నని చూడాలని వాడు అల్లరిచేస్తే, ఆరోజు మేనమామ ఆతడిని తీసుకువస్తున్నాడు.

'ఆరాధన అంటే అదేనెమో' ననుకున్నది అనూరాధ.

వారిద్దరూ అలా మాట్లాడుకుంటూవుండగానే గేటుదగ్గర బండిఆగిన చప్పుడయింది. నరసయ్య సంభ్రమంతో లేచి, గేటుదగ్గరకి పరుగెత్తాడు. జట్కాలోంచిదిగిన ఆరేళ్ల కుర్రవాడు చెంగున వచ్చి, నరసయ్యను చుట్టేసుకున్నాడు. నరసయ్య వాడిని ఎత్తుకుని ఉపేంద్ర, అతడి బావమరిది వెంటరాగా లోపలకు వచ్చాడు. ఉపేంద్ర అనూరాధను చూడంగానే, "హలో" అని పలుకరించి, "ఇతడు నా బావమరిది చిరంజీవి. ఈమె అనూరాధ చిరంజీవి! ఈ కళఅంతా ఆమె చలువే" అని ఆ ఇద్దరికీ పరిచయం చేశాడు. అంతా లోపలకు వచ్చారు. కొంతసేపు గురువుగారితో పిచ్చాపాటీ మాట్లాడి ఇంటికివచ్చింది అనూరాధ.

వారంరోజులు గడిచాయి. ఈ వారంరోజుల్లోనూ రాంబాబు అనూరాధదగ్గర బాగా మాలిమి అయిపోయాడు. ఉపేంద్ర, చిరంజీవి అది చూసి నవ్వి "మీఇంటికి తీసుకుపొండి వాడిని అన్నారు. అనూరాధ సిగ్గుపడింది. అందుకుతోడు నరసయ్య ముసిముసినవ్వులు నవ్వుతూ ఆమెవంక చూడటం ప్రారంభించాడు. అనూరాధ మొదట్లో అది గమనించకపోయినా, కొన్నాళ్లకి 'ఎందుకో'నని ఆశ్చర్యపోయింది.

ఒకరోజున అనూరాధా, ఉపేంద్రా, చిరంజీవీ కూచుని మాటాడుకుంటూండగా, చిరంజీవి "కళాకారుల్ని చేసుకున్న ఆడది సుఖపడదనుకుంటాను. ఏం అనూరాధాదేవి?" అన్నాడు చటుక్కున.

"ఎందుకని?" అన్నది అనూరాధ చకితురాలై.

"ఎప్పుడూ వాళ్లూ ఊహాలోకాల్లో విహరిస్తుంటారుకదా?" అని ఉపేంద్రవైపు చూడండి అన్నట్లు సైగ చేశా డతను.

అనూరాధ అతనివైపుచూసి నవ్వాపుకున్నది. ఉపేంద్ర గాలిలో వీణ వాయిస్తున్నాడు!

"ఏమంటారు?" అన్నాడు చిరంజీవి నవ్వు ముఖంతో.

"అనేందుకేముందిగాని, అర్థం చేసుకోగల హృదయంవుంటే కళాకారుల సాన్నిహిత్యం ఆనంద ప్రదమే" అన్నది.

"అవున్లెండి. మీరూ ఆజాతివారేగా?"

నవ్వి వూరుకున్నది అనూరాధ.

ఆ మరుసటిరోజు సువర్చల వచ్చి, "మాష్టార్ని మనిషిని చేశావుటే?" అన్నప్పుడు ఆనందంతో ఉప్పొంగిపోయింది అనూరాధ. అతడిలో కానవస్తున్న మార్పుకంతటికీ తానే కారణమా అని ప్రశ్నించుకుంటే వచ్చిన సమాధానం ఆమెను గర్వితురాలిని చేసింది. అందుకు తాను పడ్డశ్రమా గుర్తుకొచ్చింది. పాఠం చెప్పించుకోవడానికి వెడితే దీన వదనంతో వెర్రివాడిలా సాక్షాత్కరించేవాడుఉపేంద్ర. పలుకరిస్తే వేదాంతం మాట్లాడేవాడు. తాను నీరుగారిపోయినా, అతడిపై కలిగిన జాలితోకూడిన అభిమానంతో జవం తెచ్చుకుని హాస్యోక్తులూ, తమాషా కబుర్లూ వర్ణించి, అతడి దైన్యం పోగొట్టేది. అతడు పావుగంట పాఠంచెబితే, అదే మహాప్రసాదం అని వినేది. నిజం కూడా అంతేనేమో. వీణాతంత్రులపై, అతడివ్రేళ్లుచేసే విన్యాసం తనను ముగ్ధురాల్నిచేసి, అప్రయత్నంగా తన చేత వీణ వాయింపించేవి.

అలాకాదూ తాను నేర్చుకున్నది?

ఈ అనుబంధంలో చిత్రమేమీలేదు అనుకున్నది అనూరాధ. ఇది మానవ సహజం. అతడు దైవోపహితుడు. తాను మానవి. బాధ్యతలను తలదాల్చటానికి వెనుకంజవేసే స్వార్థమూ, పిరికితనమూ తనకు లేవు!

ఆమాట విన్న నేస్తురాలు సువర్చల "అన్నీనా?" అన్నది.

"అంటే?" అన్నది అనూరాధ అమాయకంగా.

"ఆలోచించుకో" అన్నదామె నవ్వుతూ.

అనూరాధకు నిజంగానే ఆక్షణాన నేస్తురాలి ప్రశ్నలోనిభావం అర్థంకాలేదు.ఆ మరునాడు,ఉపేంద్ర ఇంటికివెళ్ళినప్పుడు నౌకరు నరసయ్య ఆమెను చూసి, ఆనందంతో నవ్వుతూ, "అయ్యగార్ని తిరిగి మనిషిని చేశావమ్మా" అన్నప్పుడు ఎందుకో ఒక్కక్షణం కలవరపడిందామె. అందుకుతోడు ఆ సాయంత్రం ఉపేంద్ర తనకు వీణ వాయిద్యంలోని ఘనతను విపులీకరిస్తున్నప్పుడు రాంబాబువచ్చి, మామూలుగా 'ఏమండీ' అని పిలిచేవాడు. 'నమస్తే పిన్నీ' అనడంతోఆమె తెల్లబోయింది. అదేక్షణాన ఉపేంద్ర ముఖం పాలిపోవడం ఆమె గమనించింది. అనూరాధ నోట మాట రాలేదు.

ఉపేంద్ర కొన్ని క్షణాలకు తెప్పరిల్లి, "ఉత్త అల్లరివెధవ. ఏమీ అనుకోకు అనూరాధా" అన్నాడు. గుటకమింగి వూరుకుంది అనూరాధ.

ఆపూట పాఠం అంతటితో అంతంకాక తప్పలేదు.

ఆరాత్రి అనూరాధకి కొంత అర్థమైనట్లయింది.

నిజమే! పరిస్థితులూ, సంఘటనలూ దారితీస్తోన్న పరిణామం అలాగేవుంది. అందులో వైచిత్రి లేదు కూడా అతడు .....అందగాడే! అమాయకుడూ, సహృదయుడూ కూడా! అన్నిటికీమించి అతడిలోని కళావైదగ్ధ్యం! కాని....

అనూరాధ తన తలంపులను తన ఎదలోనే దాచుకుంది అప్పటికి. కాని, అది ఉవ్వెత్తునపొంగే, అనురాగజలధి. ఆయకట్టు అసాధ్యం. నేస్తురాలు విని, "మంచిదే అనూ! ఆయనా ఆ తలంపుతోనే వున్నట్లు విన్నాను" అనడంతో సిగ్గుతో కుంచించుకుపోయింది అనూరాధ.

రెండునెలలు గడిచేసరికి అనూరాధ మిసెస్ ఉపేంద్ర అయింది.







మోదీ అండ్ కో., ౮౫, ప్రిన్సెస్ స్ట్రీట్, బొంబాయి-2

శ్రీబాలాంజనేయ ప్రశ్న

సంతానము, రోగములు, గ్రహబాధలు, వివాహం, పారిపోయిన పశువులు, మనుష్యులయొక్క ఆచూకీ, దొంగిలింపిన సొమ్ము, వీడిపోయినభార్య మీరు కోరిన 5 ప్రశ్నలకు వెంటనే వ్రాసి పంపగలను. రూ 2 ఎం.ఓ. చేయండి. నెలలవారీగా 12 నెలలకు 1 సంవత్సరం జాతకము రూ 2. పూర్తి పేరు, జాబు వ్రాసిన టైము తెలిపిన చాలును.

హనుమాన్ జ్యోతిషాలయము,
10వ లైను,అరండల్ పేట, గుంటూరు2.

# మీ అందానికి మంచిదారి



మీ జీవిత విజయాలకు అందం అవసరం. ఎండవేడికి యింకా యితరకారణాలవల్ల ముఖం క్రమేపి నల్లబడి, ముది రూపువస్తుంది. గ్లోరియా అనే ద్రవముయొక్క అద్భుత సౌందర్య పోషకశక్తి మీ ముఖంలోని అసహ్యమయిన ముదిరూపును పోగొట్టి ఆకర్షణీయమయిన లేతదనాన్ని తెస్తుంది. మీ అందం దినాదినాభివృద్ధి అవడానికి నెలకు అదమం కొన్నిసార్లు అయినా గ్లోరియా అనే సౌందర్య పోషక ద్రవాన్ని వాడండి. ముఖంమీద మొటిమలను వాటి మచ్చలను, ముడతలను, నమ్మకంగా పోగొట్టి ముఖాన్ని తెలుపుచేసి, కాంతిని, అందాన్ని తెచ్చును. మొదటి పూతకే మీకు ఆశ్చర్యాన్ని కలిగించే అందాన్ని యిస్తుంది. ఒకసారి వాడి చూస్తే మీరెప్పుడూ విడువరు అన్నిషాపులలో దొరకును

జనితా ప్రొడక్ట్సు - ఏలూరు. (ఆంధ్ర)

దుర్గా షాపెప్



ఆరితేరిన అధ్యాపకులు. మంచి పరీక్షా ఫలితాలు

లేడీస్ హాస్టల్ రవి ట్యుటోరియల్ కాలేజి మెన్స్ హాస్టల్

బాలికాశాఖ 2వ లైను. | బ్రాడీపేట, గుంటూరు | బాలుర శాఖ 3వ లైను.

జూనియర్, సీనియర్, మెట్రిక్, S.S.L.C, P.U.C. పరీక్షలకు శిక్షణయివ్వబడును. క్లాసు:ప్రారంభం జూన్.1

ప్రిన్సిపాల్:- సి. వి. యస్ ధన్ M.A.



వేసంగి విసిగించితే రంజన్ ఆహ్లాదము నిచ్చును!

సుఖ జీవనమునకు
జీవిత కాలసహచరిణి

Ranjan

16 DELUXE TABLE FAN
OSC SWANNECK MODEL



రంజన్.
డీలక్స్, టేబిల్, సీలింగ్, కేబిన్, పెడస్టల్.

ఆంధ్ర ప్రదేశ్ సోల్ ఏజంట్లు: P. విశ్వనాథం, గాంధీనగరం, విజయవాడ 3.


# భగ్నవీణ

ఆ ఫలితానికి కారణభూతులయిన అన్నగారినీ
సువర్చలనూ మనసులో దైవాలుగా నన్నుతించు
కున్నది అనూరాధ. ఆమె ఆనందానికి అవధులులేవు.

కొలది రోజులలోనే ఉపేంద్ర మామూలు మని
షయిపోయాడు.

'కల' సంసారం. అందులో ఏరికోరి ఒకరిపై
ఒకరు మరులుగొని చేసుకున్న దాంపత్యం. రోజులు
నిమిషాలవలె గడిచిపోయాయి. రాంబాబు నెమ్మదిగా
మాంటిస్సోరీలో అయిదో తరగతికి వచ్చాడు—
రెండేళ్లు పెరిగి.

వాడికి నీళ్లు పోస్తున్నప్పుడు, గారాలుపోతే లాలి
స్తున్నప్పుడు, రాత్రుళ్లు జోలపాడుతున్నప్పుడు
అనూరాధకు ఆనందంతోపాటు ఎదలో మార
మూల నెక్కడో వెలితిలాంటిభావం కలగసాగింది.
ఆ సమయాన ఆమెకు కించిత్ ఆశ్చర్యం కలిగేది.

ఏముంది తనకుతోడు? తాను తప్ప, మరోలోకం
ఎరగనివాడు తన భర్త. రాంబాబు తనను కొడుక
కన్నా......

మనోవీణ తీగెలని ఎవరో కర్కశంగా మీటారు
అప్పుడు! తెలుసుకో తెలుసుకో!' అంటున్నట్లు
అనూరాధ మనసు వికలమైంది.

ఒంటరిగా బాల్కనీలో నుంచుని, కింద ఏపుగా
పెరిగిన మొక్కలనుచూస్తే వాటి శాఖలకు వేలాడే
ఫలాలు కిసుక్కున నవ్వేవి. ఆహారాన్ని మోసుకుపోయే
పిచికలూ, చీమలూ ఎక్కడి తంత్రులనో మీటి
'హిహిహి' అని వెళ్లిపోయేవి. ఉపేంద్రతోకలిసి
షికారుకో, సినిమాకో వెళ్ళినప్పుడు అనతిదూరంలో
కెవ్వుమన్న శిశువు ఆమె ఎదలో గునపం దింపేవాడు.
తనకూ కావాలి మాతృత్వం!

ఆమె దిగులుగా ఖేదంగా ఉన్నప్పుడల్లా ఉపేంద్ర
'శంఖవీణ' శృతిచేసేవాడు. అనూరాధ కదిలిపోక నిలు
గలిగేదికాదు. అతడిపై వాలిపోయి, సోలిపోయేది.
అతడుమాత్రం 'ఏమిటి నీదిగులు?' అని అడిగిన
పాపానపోలేదు. అందుకు అనూరాధకు కష్టం కల
లేదు. అసలా స్పృహ ఆమెకు ఉంటేకదా?

ఒకరోజున—ఆనాడు ఉపేంద్ర దగ్గరలోవున్న
కొండల దగ్గిరకి పిక్నిక్ ఏర్పాటు చేశాడు. అనూ
రాధకు ఉత్సాహం లేకపోయినా, సువర్చలా, ఉపేంద్ర
బలవంతం చేయడంతో ఒప్పుకున్నది. కృష్ణానది
లాంచిమీదదాటి తోటలమధ్యనుంచి పరుగెత్తుతూ
ఆ కొండలవద్దకు జేరుకున్నారు వాళ్ళు. అనూరాధకి
కాళ్లు బొప్పులు పుట్టేదాకా, ఆ పరిసరాలన్నీ తి
గింది. అక్కడంతా మామిడితోటలు. పేరుకి కొండలే
కాని, అవి చిన్న చిన్న గుట్టలు మాత్రమే. ఆ కొండలో
ఓ గుహ ఉన్నది. అందులో ఈ మూలనుంచి
ఆమూలవరకూ దాదాపు ముప్పయి అడుగుల పొడ
గున, విశ్రాంతి తీసుకుంటున్న అనంత పద్మనాభ
స్వామి విగ్రహం వున్నది. ఒంటరిగా ఆ గుహ దగ్గి
రకు వచ్చింది అనూరాధ. కింద చదునుగావున్న
ప్రదేశంలో వెంటతెచ్చిన పట్టాపరిచి, ఫ్లాస్కుల్లోంచి
పాలుతీసి, కాఫీ ఏర్పాట్లు చేస్తున్నారు ఉపేంద్రా
సువర్చలా. రాంబాబు నరసయ్యతో తోటలవైపు
బయలుదేరాడు. ఒక్క నిముషంపోయాక, ఒక స్త్రీ
వాళ్లదగ్గరకు వచ్చింది. చాలా అసహ్యంగావుంది.
దాని చేతిలో పింగాణీ బొచ్చె ఒకటివుంది. ఆ

చూపించి, వాళ్లని ఏదో అడుగుతున్నది. ఉపేంద్ర రెండుసార్లు కసిరి, మూడోసారి ఫ్లాస్కులోని పాలు కాసిని ఆ బొచ్చిలోపోసి పొమ్మన్నాడు. ఆ స్త్రీ వెళ్ళి పోయింది.

అనూరాధ నిట్టూర్చి, గుహలోకి వచ్చింది. గబ్బిలాల వాసనతో ముక్కులు బద్దలయిపోయాయి., చెంగు అడ్డంపెట్టుకుని అనంతపద్మనాభస్వామిని నఖశిఖ పర్యంతం పరీక్షిస్తూ పాదాలవద్దకువచ్చి, కాలికేదో మెత్తగా తగలగా ఉలికిపడి కిందకు చూసింది.

పొత్తిళ్లలోవున్న పాప కెవ్వుమన్న అరుపు! తెల్లబోయింది అనూరాధ.

అదేక్షణాన 'వత్తన్నాతండ్రీ! వత్తన్నా' అన్న వగర్పు స్వరమూ, ఆ వెనుక అనూరాధ యిందాక చూసిన స్త్రీ లోపలకు వచ్చారు. ఆమె అనూరాధను చూసి, ఒక్కక్షణం వెనక్కుతగ్గి, ఆ తరువాత గుక్కపట్టి ఏడుస్తున్న పాపడిని ఎత్తుకుని పింగాణీ బొచ్చెలోని పాలు నెమ్మదిగా పెడుతూ, 'నాతండ్రీ! అన్నది. అనూరాధ ఆ స్త్రీవంక పరీక్షగా చూసింది. ఆమెకు పాతికేళ్లకన్నా ఎక్కువ వుండవు. ఆమె వాలకంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నజీవితం ప్రతిఫలించింది. అనూరాధ మనసు తిరిగి వికలమయింది.

సాయంత్రంవరకూ పిక్నిక్‌లో అన్యమనస్కంగానే గడిపింది అనూరాధ. అది ఉపేంద్ర గమనించకపోలేదు. అయినా, అతడి నోటివెంట అందుకు సూచనగా ఒక్కముక్క కూడా వెలువడలేదు. ఇంటికి మరలేవేళకి ఆకాశంనిండా దట్టంగా మబ్బులు పట్టాయి. అంతా తొందర తొందరగా సామాను సర్దివేసుకుని బయలుదేరారు. నాలుగడుగులు వేసేసరికే ఆకాశం వికటంగా గర్జించి, కుండపోతగా నీరు కుమ్మరించసాగింది.

లాంచీదగ్గరకు వచ్చేసరికే అంతా పూర్తిగా తడిసిపోయారు.

ఇంటికి వచ్చినతరువాత తడిబట్టలు మార్చుకుని పొడివి కట్టుకున్నారు అంతా. సువర్చల వాళ్లతో పాటు వెచ్చ వెచ్చని టీ తాగి, ఇంటికి వెళ్ళిపోయింది. అనూరాధ కేశాలు ఆరబెట్టుకుంటూ బాల్కనీ వెనుకవున్న వరండాలో కూర్చున్నది.

ఒక గంట గడిచింది. ఉపేంద్ర కూర్చున్న చోటునించి లేచి, "చలివేస్తున్నది అనూ! గదిలోకి పోతున్నాను" అని లోపలకు వెళ్లాడు. అనూరాధ కొంతసేపు అలాగే కూర్చుని వంటమనిషి కేకకులేచి భర్తవున్న గదిలోకి వెళ్ళింది. వంటినిండా రగ్గు కప్పుకుని, పడుకుని వున్నాడు ఉపేంద్ర. అనూరాధ అతనివద్దకువచ్చి "భోజనానికి రారూ?" అన్నది.

ఉపేంద్ర నెమ్మదిగా "ఉహు" అన్నాడు.

అనూరాధ ముందుకువంగి, అతడి నుదుటిపై చేయివేసింది.

చేయి చుర్రుమన్నది!

అనూరాధ కంగారుగా, "జ్వరమా?" అన్నది.

"ఊ" అన్నాడు ఉపేంద్ర నవ్వుతూ—పేలవంగా.

అనూరాధ వడి వడిగా హాల్లోకివచ్చి నరసయ్యను కేకవేసి, "అయ్యగారికి జ్వరం వచ్చింది. పోయి డాక్టరుగార్ని పిలుచుకురా" అన్నది. రాంబాబుతో కబుర్లు చెబుతూ కూచున్న నరసయ్య లేచి, అరగంటసేపటికి డాక్టరును వెంటబెట్టుకువచ్చాడు. ఈ అరగంటలోనూ ఉపేంద్ర జ్వర తీవ్రత హెచ్చిపోయింది. వచ్చిన డాక్టరు వంకయినా చూడలేకపోయిన అనూరాధ లేచి, పక్కను అవతల నిలబడింది. డాక్టరు నాడి పరీక్షించి, "వానలో తడిసినందువల్ల వచ్చిన జ్వరమమ్మా. రేప్పొద్దుటికి తగ్గిపోతుంది" అన్నాడు. ఆ కంఠం ఎక్కడో విన్నదానిలా స్ఫురించి అనూరాధ, అతడివంకచూసి, చకితురాలై "మీరా?" అన్నది.

అతడి పరిస్థితీ అంతే అయింది. ఒక్కక్షణానికి తెప్పరిల్లి, "మాత్రలుఇచ్చి వెళతాను. నాలుగుగంటలకొకటి వెయ్యండి. ఓ అరగంటలో బాగా నిద్రపడుతుంది. తెల్లారాక మళ్లీవచ్చి చూస్తాను" అన్నాడు.

"అలాగే" అన్నది అనూరాధ.

ఉపేంద్ర అపస్మారస్థితిలో కళ్ళు మూసుకుని పడుకుని వున్నాడు. అనూరాధ అతడినిలేపి, మాత్ర వేసి మింగించింది. నరసయ్యచేత ఉడుకులాం తెప్పించి వేసింది నుదుట.

కొంతసేపు మౌనంగా కూర్చుని లేచాడు డాక్టరు.

అనూరాధ "ఉండండి! ఏదన్నాతాగి తీసుకు వెళుదురుగాని" అన్నది.

అతడు కాదని వెళ్ళబోయి నవ్వుతూ, "సరే! మీమాటమాత్రం ఎందుకు కాదనాలి?" అని కూర్చుండిపోయాడు.

అనూరాధ లోపలకువెళ్ళి ఓవల్టీన్ కప్పునిండా కలుపుకు తీసుకువచ్చి, అతడికి ఇచ్చింది. అతడది అందుకుని చప్పరిస్తూ, "మీ మారేజీకి రాలేకపోయాను" అన్నాడు.

అనూరాధ ఏమీ అనలేదు.

"నాన్నగారూ, అమ్మగారూ కోపగించుకున్నారా"

"అడగకపోయారా?"

"ఏదీ? ఈవూరువచ్చి ఇంకా వారంరోజులయినా కాలేదు. ఆసుపత్రి హడావుడిలో చావటానికి కూడా తీరిక ఉండేట్లులేదు."

అనూరాధ సన్నగా నవ్వుకున్నది. అయిదారేళ్ల క్రితం విద్యార్థిగా తమఇంటికి వచ్చినప్పుడు ఎలా ఉన్నాడో, అలాగే, అంత ఉషారుగానూ వున్నాడతను.

అతను కప్పు బల్లమీదపెట్టి, ఆదమరిచి నిద్రపోతున్న ఉపేంద్రవంక ఒక్కసారిచూసి, "ఈయన భాగ్యనగరంలో కొన్నాళ్లు వున్నారుకదూ?" అన్నాడు.

"ఊ!"

"ఆయన మొదటిభార్యను నేను బాగా ఎరుగుదును. ఇద్దరూ చాలా అన్యోన్యంగా వుండేవారు..... కాని, ఏం ప్రయోజనం? కొడుకునుకన్న ఏడాదిలోనే ఆమె........." చటుక్కున ఆగిపోయాడతను.

"నాకు తెలుసు" అన్నది అనూరాధ.

"తెలుసా? అన్నాడతను ఆశ్చర్యంగా.

"తెలియకుండా ఎలా ఉంటుంది? కొడుకు కూడా వున్నాడుగా?"

"అదికాదు."

"మరి?" ఈసారి ఆమె ఆశ్చర్యపోయింది.

అతను ఒక్క నిముషం తటపటాయించాడు. ఏదో చెప్పదలుచుకున్నాడనీ, అది చెప్పలేక బాధపడుతున్నాడనీ గ్రహించి, "ఫరవాలేదు చెప్పండి" అన్నది అనూరాధ గుండెలలోతుల్లోంచి మెల్లిగా కలుగుతున్న భయంవల్ల ఒణుకుతున్న గొంతుకతో,


సినీతారల ఫోటోలు

మీ అభిమాన సినీతారల ఒరిజినల్ ఫోటోలు అందమైన పోజులలో కార్డు సైజు డజను 1 కి రు. 5/-. పోస్టేజి రు. 1/- అదనం.

CENI PHOTO DISTRIBUTORS

(P O) Relangi (W. G. Dt)

నాకాస్

నేటినుండి ఉబ్బసపు వ్యాధితో బాధపడ నవసరంలేదు. ఈ వ్యాధి నిర్మూలనకుగాను 30 సం॥ల పరిశోధనా ఫలితముగా లభ్యపరచుకొనబడి, పరమహంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేదౌషధం. ఎంత మొండి వ్యాధికైనను తక్షణమే బాధ నివారింపజేయుటయే గాక కొంతకాలము సేవించిన తిరిగి చూపెట్టదు.

8 ఔ॥ రు. 3-75. పోస్టేజి ప్రత్యేకం.

ఇండియన్ మెడిసన్ హౌస్, విజయవాడ-2.

RATNAM'S N-OIL

(పైపూతకుమాత్రమే)

అంగనరములు బలహీనతి చెంది, చిన్నదనవో తిరిగి యథాప్రకారం అంగ శ్రేష్ఠ సౌఖ్య మనుభవించుటకు 50 సం॥ ప్రఖ్యాతి గలది. 1 సీసా రూ. 10 లు వి. పి. 1-4-0 కావలసినవారు ముందుగా 1-4-0 పంపేది. ఇందులో స్పెషల్ రకం అర్జంటుగుణమునకు రూ. 25-0-0 లు.

డాక్టర్. రత్నం సన్స్, (Estd 1904) చులక పేటబిల్డింగ్స్, ఆజంపూరామార్కెట్ వద్ద, హైదరాబాద్-24 (ఆంధ్రప్రదేశ్)

ప్రతియింటికి కావలసిన పుస్తకములు

జీవితరహస్యాలు :- మీ దాంపత్య సుఖానికి అనేక కామసూత్రాలు :- రు. 3-50 యువతీః స్త్రీలనుగురించి అనేక కుతూహల విషయాలు రు. 3-50 సంతానం : గర్భనిరోధానికి 60 నవీన సులభమార్గాలు రు. 3-50.

అమృతరహస్యాలు : వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు రు. 6

ఉద్యోగదర్శిని : మనదేశంలోని అన్ని రకాల ఉద్యోగాలు, అర్హతలుపొందేమార్గాలు రు. 5

5 పుస్తకముల పూర్తిసెట్టు రు. 10/- వి. పి. పి. ఛార్జి రు. 1-50 అదనం.

TAGORE VIGYAN MANDIR

(510) Phapala, Aligarh


డొక్టరు జాన్సన్సు
చవనామృతము
అందరికి టానిక్కు
బాలరక్ష
పిల్లల ఆరోగ్యముకు
ఏజంట్లు: లక్ష్మీనారాయణకంపె
కాకినాడ.

కోరువార్కి
సూచీపత్రములు
పంపుదుము.
★
స్టాకిస్టులు
కావలెను
★
లక్ష్మీనారాయణ
కంపెనీకి
వ్రాయండి.




మద్రాసు ఏజెంట్లు : మెసర్సు బలభాయ్ & కంపెని. మద్రాసు.
ఎగుమతి వివరాలకన్నిటికి మెసర్సు ఎం. ఎం. ఖంభట్ వాలా అహమ్మదాబాద్ వారిని సంప్రతించండి. శ్రీకాకుళం స్టాకిస్టు: శ్రీకృష్ణ మెడికల్ &జనరల్ స్టోర్సు, శ్రీకాకుళం. భీమవరం స్టాకిస్టు: మెసర్సు: గుండు అక్కిరాజు&సన్సు, భీమవరం.

# భగ్నవీణ

అతను మరొక్క నిముషం సందేహించాడు. చివరికి "ఈ విషయం చెప్పవలసి వస్తుందనుకుంటే ఇక్కడికి రాకనేపోయేవాడిని. మొదట్లో గుర్తు రాలేదు కూడా. కాని.....అతని మొదటిభార్యమీద అతడికివున్న ప్రేమ మీ జీవితాన్ని నాశనం చేసింది అనూరాధాదేవీ! ఆ కొడుకు కలిగినప్పుడు ఆ తల్లిపడిన ప్రసవ వేదన నేను కళ్ళారా చూశాను. మా డాక్టర్ ఆమె బ్రతుకుతుందన్న ఆశ వదులుకున్నది. భగవతీకృప వల్ల ఆ తరువాత బ్రతికిందనుకోండి. కాని, ఆ సంఘటన ఉపేంద్రను బాగా కదిలించివేసింది. అందుకని......" అని అర్ధోక్తిలో ఆగిపోయాడు.

"చెప్పండి" అన్నది అనూరాధ దడ దడ కొట్టుకుంటున్న గుండెలతో.

"అతను పిల్లలు కలుగకుండా ఆపరేషన్ చేయించుకున్నాడు."

* * *

తుళ్ళిపడి లేచికూచున్నది అనూరాధ.

ఆమె మనసు మరింత అల్లకల్లోలమయి పోయింది. మంచంమీద పడుకుని హాయిగా నిద్రపోతున్న భర్తవంక చూసిందామె. ఆముఖం ఎంత అమాయకంగా ఉంటుంది! ఎంత సహృదయుడు అతను? అయితేనేం?

తెలిసీ తన జీవితం నాశనం చేశాడు! ఆమెలోని సంఘర్షణ కొంతసేపటికి ప్రతీకారరూపందాల్చింది. తన జీవితాన్ని దగ్ధంచేసిన ఈ మనిషితో తనకు ఏమి పని! తానూ చదువుకున్నది. లోకంలో బ్రతుకలేకపోదు. ఒకవేళ తన బ్రతుకు భంగం కలుగుతే తనను తాను అంతం చేసుకోగలదు. తన సుఖంతో, తన మనసుతో రాక్షసంగా క్రీడించిన ఈ మనిషితో తనకు ఎట్టి......

అనూరాధ ఒక నిశ్చయానికివచ్చి, లేచి నించున్నది. ఉపేంద్ర వళ్ళు తెలియకుండా నిద్రపోతున్నాడు. ఆమె ఆ గది గుమ్మంపక్కగావున్న టేబిల్ దగ్గరకుపోయింది. డ్రాయరుతెరిచి, అందులోనుంచి లెటర్‌పాడ్డూ, కలమూ తీసింది. భర్తకు తాను వెళ్ళిపోతున్నట్లు, తిరిగిరానట్లు తెలియజేస్తూ, ఉత్తరం వ్రాసి, బల్లమీదవున్న వీణక్రింద కనపడేలాపెట్టింది. చెంగు ఒళ్ళంతా కప్పుకుని, చివరిసారిగా ఆ గది వయివూ, భర్తవైపూచూసి మేడ దిగింది.

తెల్లవారబోతున్నది. వీధిలో జన సంచారం ప్రారంభమైంది. అనూరాధ వడి వడిగా ముందుకు నడిచి, దాదాపు గేటు దగ్గరకు వచ్చేసింది. అక్కడాన ఆమెకు ఒక్కసారి తిరిగి, ఆ యింటివైపు చూడాలనిపించింది.

ఆదృశ్యం—అనూరాధ అక్కడున్న 'ఆర్చి' పైన వాలిపోయింది. ఆమె అంతరాంతరాలలోంచి వేదనా, దుఃఖమూ పెల్లుబికి రాసాగింది. తను ప్రాణాధికంగా పెంచుకున్న ఈ తోట, తను మనసారా కోరుకున్న ఈ కాపురం—ఇవి తాను వదలవలసిందేనా?

గత్యంతరం? కావాలని ఉపేంద్ర చేసిన ఈ ద్రోహానికి ప్రతీకారం తాను చెయ్యాలి. అతడు తన వియోగంతో కుమిలి కుమిలి ఏడవాలి. అప్పుడు తనకు ఆత్మసంతృప్తి.

కాని, అప్పటికయినా నిజమయిన సంతృప్తి

కలుగుతుందా? 'కలుగుతుంది', 'కలుగదు' ఏది నిజం?

అనూరాధ ముందుకు అడుగువేసి అక్కడున్న నచ్చికప్పై వాలిపోయింది. ఆమె మనసు తిరిగి సంఘర్షణకు లోనైంది.

తా నా ఈనాడు ఈ యింటినీ, భర్తనూ వదిలి పెట్టి వెళ్లిపోతుంది. అందువల్ల తనకు జరుగగల మేలు ఏముస్నది? ఉపేంద్ర మళ్లీ పూర్వస్థితికి రావచ్చు. ఇంద్రభవనంలాంటి ఈ యిల్లు పాడయి పోవచ్చు. తనకు మాత్రం? ఒంటరిగా, తీరని వ్యథతో కుమిలిపోతూ, ఎన్నాళ్లని బ్రతుకుతుంది? తనకు మరోమార్గం లేకపోవచ్చు. కాని, ఈమార్గంవల్ల జీవితం కుక్కలు చింపిన విస్తరికాదా?

ఇక్కడవుంటే? అతడు తనకు చేసిన ద్రోహాన్ని క్షమించగలిగితే, తనకు ఆనందప్రదమయిన భావి అయినా ఉంటుందేమో? దాంపత్యసౌఖ్యాలు తనకు ఎలాగూలేవు. కనీసం ఆ అమాయకుడయిన పసివాడి పోషణలోనయినా, తనకు జీవన మాధుర్యం అనుభవమౌతుందేమో?

అనూరాధ వివశురాలై ఆ నచ్చికప్పై అలాగే కొంతసేపు ఉండిపోయింది. కలిగినది తీవ్రమయిన అఘాతం అదీ హృదయంపై!

కొన్ని నిముషాలకి—అనూరాధ ఉలికిపడిలేచి కూచున్నది. పమిట సవరించుకుని, "అమ్మగారూ" అన్న నరసయ్య కేకవిని వడివడిగా ఇవతలకు వచ్చింది. మరుగులు కక్కుతూ పరుగెత్తుకుంటూ వస్తున్నాడు అతను. అనూరాధను చూసి, ఆమె పాదాలమీదపడి "అయ్యగారు....పడిపోయారమ్మా" అన్నాడు భోరున ఏడుస్తూ.

అనూరాధ నివ్వెరపోయింది. నరసయ్యాలేచి, "గది గుమ్మంలో పడివున్నారమ్మా!........ఆర్ని బ్రతికించండమ్మా" అన్నాడు వెక్కుతూ. అనూరాధ ఇక నిలువ లేకపోయింది. వేగంగా మేడఎక్కి గదివద్దకు వెళ్లింది. నిజంగానే అతడు నేలమీద పడివున్నాడు. అతడి పక్కనే మధ్యగా విరిగిన శంఖవీణ పడివున్నది. అనూరాధ గుండె దిటవు చేసుకుని, అతడిని నరసయ్య సాయంతో మంచంమీదకు జేరవేసింది. ఆమె అతడి శిరసు తన ఒళ్లో పెట్టుకుని, విసురుతూ 'ఏమండీ!' అన్నది. ఉపేంద్ర చిన్నగా మూలిగాడు. దూరంగా నిలుచున్న నరసయ్య ఆమె వ్రాసిన ఉత్తరం ఆమె చేతికే యిచ్చి, "డాక్టర్‌గార్ని పిలుస్తానమ్మా" అని బయటకు వెళ్ళిపోయాడు.

అనూరాధ రెండుగా విరిగిన ఆ వీణవైపు చూసింది. అది యిక అతకదు. అతికినా సహజ లాలిత్యంరాదు. తన కథ అసాధ్యమేమో కూడా.

కాని అది తన ఒకనాటి కలలకు ప్రతిరూపం. తన ఆనందాన్ని ప్రకటించుకున్న మహత్తర సాధనం. అతుకు కావచ్చు. తన కథ తప్పదు.

అదే తన జీవితంలో మిగిలిన ఆశ. ఉపేంద్ర కదిలాడు. మెల్లిగా కళ్ళు తెరిచి "అనూ" అన్నాడు. "ఊ" అన్నది అనూరాధ. "వీణ విరిగిపోయింది అనూ" అన్నా డతను! అంత బాధలోనూ గాద్గదికంగా.

"అవున్ను అవును" గొణిగిందామె. ★


తాజాగాను, సువాసనగాను ఉండును

పంకజ్ శాండల్

టాయిలెట్ సోపు

శరీరమును కోమలముగాను, అందంగాను, పరుచుదనంగాను ఉంచును.




పంకజ్ సోప్స్ & ఆయిల్ మిల్స్, కొచ్చిన్



ఆంధ్రకు డిస్ట్రిబ్యూటర్లు: కె. వి. నారాయణరావు & సన్స్, పి. బి. నెం. 16, విజయవా

బాధగా అసహ్యంగా వుండే గజ్జినుంచి త్వరగా బయటపడండి.

గజ్జి అంటువ్యాధి. అది మీ కుటుంబంలోని యితరులకు వ్యాపించకుండా వుండేందుకు ముందుగానే, మీరు అమృతాంజన్ లిమిటెడ్‌వారి డెర్మల్ అయింటుమెంటును వాడి త్వరగా, పూర్తిగా ఉపశమనం పొందండి. మళ్లీ ఆ అంటువ్యాధి తలయెత్తకుండా వుండాలంటే, మీరు తగిన జాగ్రత్త తీసుకోవడం అవసరం.
అమృతాంజన్ డెర్మల్ అయింటుమెంటు డబ్బా ఒకటి ఎప్పుడూ యింట్లో ఉంచుకోండి. అది తామరకూ, పాసినకాళ్లకూ కూడా పనికివస్తుంది.



అమృతాంజన్ లిమిటెడ్‌వారి

డెర్మల్ ఆయింట్‌మెంట్

అమృతాంజన్ లిమిటెడ్ 14/15, లజ్‌చర్చి రోడ్డు, మద్రాసు-4
బొంబాయి-1, కలకత్తా-1, న్యూఢిల్లీ-1.

JWT AM/Q/1740